ప్రజాశక్తి
సోమవారం 1 మే 2023 5
శ్రీ సత్యసాయి



వేసవిలో పశుసంరక్షణ ముఖ్యం

◆ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి

◆ సత్యసాయి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభ దాస్



జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

"రైతులు వ్యవసాయం తరువాత అత్యంత ప్రాధాన్యత ఇచ్చేది పాడి సంపద పైనే. గ్రామాల్లో ఎక్కువగా పాడి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వేసవికాలంలో పశువులు, గేదెలు, గొర్రెలు మేకల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించి కాపాడుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మేత మేపడానికి ఉదయం 11 గంటల వరకు, తరువాత సాయంత్రం వేళ మాత్రమే బయటకు తీసుకెళ్లాలి. మూగజీవాల పెంపకంపై వేసవిలో పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలి". అని శ్రీ సత్యసాయి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ పేర్కొన్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో మూగజీవాల పోషణపై పలు విషయాలను తెలియజేశారు.

ప్రశ్న:జిల్లాలో ఎన్ని పశు వైద్యశాలలు ఉన్నాయి? వాటి వివరాలు తెలపండి?

ఎడి: జిల్లాలో మూడు డివిజన్లలో 15 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 23 గ్రామీణ పశు వైద్యశాలలు ఉన్నాయి. ఇవిగాక 412 రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందుతున్నాయి. 13 సంచార వైద్యశాలలు పనిచేస్తున్నాయి. అత్యవసరం అనుకున్నప్పుడు 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే వెంటనే గ్రామానికి వెళ్లి వైద్యం అందిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఈ సంచార వైద్య వాహన సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాలో పశువులు, చిన్న జీవాలు ఎన్ని ఉన్నాయో వివరిస్తారా?

ఎడి: జిల్లాలో ఆవులు, ఎద్దులు కలిసి 2.60 లక్షలు, గేదెలు 0.82లక్షలు ఉన్నాయి. ఇవికాగ గొర్రెలు, మేకలు ఉన్నాయి.



ప్ర: వేసవిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

ఎడి: వేసవి కాలంలో మూగజీవాలు పలు వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పశువులు వడదెబ్బకు గురికాకుండా మేతకు ఉదయం 11 గంటల లోపు తరువాత సాయంత్రం పూట తీసుకెళ్లాలి. చల్లటి వాతావరణంలో వాటిని ఉంచేలా చర్యలు తీసుకోవలి. ఎప్పటికప్పుడు నీటిని తాపించాలి. వడదెబ్బకు గురైందన్న సంకేతాలు తెలియగానే వెంటనే గ్రామీణ వైద్య శాఖల లేదా ఆర్‌బికెల్లోని అధికారులను స్పంప్రదించి తగిన వైద్యం అందించాలి.

ప్రశ్న:పాడి పశువులకు ప్రభుత్వం నుంచి అందించే దాణా వివరాలు తెలపండి.?

ఎడి: జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 100 మెట్రిక్ టన్నులు గడ్డి, జొన్నలు సరఫరా చేసాం. ఇందులో 75 శాతం సబ్సిడీతో వీటిని అందిస్తున్నాం. పశు గ్రాసం కొరత లేకుండా గడ్డి విత్తనాలతో తీసుకుని గ్రాసం పెంచుకోవచ్చు.

ప్రశ్న:- పాడి రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

ఎడి : పశుసంవర్ధక శాఖ చేపడుతున్న హెల్త్ క్యాంపులలో పాల్గొని రైతులు పశు పోషణ, దిగుబడులు గురించి అవగాహన పెంచుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా విజ్ఞాన బడులు కార్యక్రమంలో పాల్గొని తగిన సలహాలు సూచనలు పాటిస్తే పాడి సంపదను మరింత వద్ధి చేసుకోవచ్చు.

ప్రశ్న: జిల్లా పశుసంవర్ధక శాఖలో సిబ్బంది, మందుల కొరత ఏమైనా ఉందా.?

ఎడి : జిల్లా వ్యాప్తంగా 72 మంది శాస్త్ర సహాయకులు ఉండాల్సి ఉండగా 32 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 60 మంది కాంపౌండర్లకు గానూ 15 మందే ఉన్నారు. మందుల కొరత ఏమీ లేదు. తగిన టీకాలు, మందులు సరిపడా సరఫరా జరుగుతోంది. సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

'నువ్వే దొంగ'..!









◆ తాడిపత్రిలో తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య డీజిల్ యుద్ధం

◆ మున్సిపాల్టీలో డీజిల్ వినియోగంపై పరస్పరం దూషణలు

◆ నువ్వు దొంగంటే.. నువ్వే దొంగని విమర్శలు

రాజకీయ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన తాడిపత్రిలో దాని వేడి తగ్గడం లేదు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. ప్రతి నిత్యం ఏదో ఒక విషయంపై ఈ ఇద్దరు నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నారు. తాజాగా మున్సిపాల్టీలో డీజిల్ వినియోగంపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. 'నువ్వు దొంగంటే... కాదుకాదు నువ్వే దొంగ' అంటూ మాటాల దాడి చేసుకుంటున్నారు. డీజిల్ వినియోగంపై గత, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జరిగిన వినియోగంపై పట్టణంలో ప్లెక్సీలు వేయించుకుని మరీ విమర్శలు చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పురపాలక సంఘం పరిధిలో మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య గత నాలుగుళ్లగా ఎదోరూపంలో మాటలదాడి జరుగుతోంది. ప్రస్తుత ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మున్సిపాల్టీలో మూడు సంవత్సరాలు డీజిల్ వినియోగం, ప్రస్తుతం ఎమ్మెల్యే పెద్దారెడ్డి హయాంలో మూడు సంవత్సరాల్లో డీజిల్ వినియోగాన్ని చూపుతూ ఎన్ని లీటర్లు వినియోగించారు.? దీనికి ఎంత డబ్బులు ఖర్చు చేశారు..? అన్న విషయాలను తెలియజేస్తే తాడిపత్రిలో రెండు రోజుల క్రితం ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ లెక్కలను చూసి ఎవరు దొంగలో తేల్చుకోవాలంటూ అందులో ప్రజలను కోరారు.

తాడిపత్రి నియోజక వర్గంలో నాలుగు దశాబ్ధాల పాటు అధికారంలో ఉండి తాడిపత్రి పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివద్ధి చేయడంలో జెసి.ప్రబాకర్‌రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారు. తాడిపత్రి మున్సిపాల్టీకి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను తీసుకొచ్చారు. 2019 సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా జగన్ గాలివీయడం, తాడిపత్రి నియోజకవర్గంలో ఉన్న వ్యక్తిగత సంబంధాల కారణంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి వైసిపి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పటి నుంచి ఆయన కూడా తాడిపత్రిలో తన మార్క్ అభివృద్ధి చూపించే ప్రయత్నం చేశారు. పురపాలక సంఘంపై ఎమ్మెల్యే ప్రత్యేక దష్టి సారించి ప్రజల మన్ననలు పొందే ప్రయత్నం చేశారు. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలను వైసిపి కైవసం చేసుకుంది. ఒక్కతాడిపత్రిలో మాత్రం తెలుగు దేశం పార్టీ సిపిఐ కలిసి ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

ఆరోపణలు... ప్రత్యారోపణలు..

రాష్ట్రంలో అధికారంలో వైసిపి ఉండడం, తాడిపత్రి మున్సిపాల్టీలో ఛైర్మన్‌గా టిడిపి అభ్యర్థి జెసి.ప్రభాకర్‌రెడ్డి ఉండడంతో ఇక్కడ రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. పురపాలక సంఘంపై పట్టు కోసం అటు ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఇటు ఎమ్మెల్యే పెద్దారెడ్డిలు ఇద్దరూ తీవ్ర స్థాయిలో పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరు నేతలూ అధికారులపైనా ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ ఇద్దరి నేతల ఒత్తిళ్ల మధ్య తాడిపత్రి మున్సిపాల్టీలో విధులు నిర్వహించడానికి కమిషనర్లు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఇక్కడి నేతల మధ్య ఒత్తిడి తట్టుకోలేక కమిషనర్లు వరుసగా బదిలీపై వెళ్లారు. ఏ అధికారీ ముందుకు రాలేని పరిస్థితుల్లో ఎక్కువ శాతం ఇన్‌ఛార్జిలతోనే పాలన సాగించారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్రస్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు జరిగాయి. పట్టణ అభివృద్ధిపై ఎజెండాలోని అంశాలను చర్చించకుండా మొక్కుబడిగా సమావేశాలు ముగుస్తూ వచ్చాయి. కమిషనర్ పాలకవర్గానికి సహకరించకుండా అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నారని ఛైర్మన్ వర్గం కౌన్సిలర్లు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. మున్సిపాలిటీలో మిగులు నిధులు రూ.17 కోట్లను కొల్లగొట్టారని జెసి.ప్రభాకర్‌రెడ్డి పలుమార్లు ఘాటు విమర్శలు చేశారు. గత వారంలో ఏకంగా కమిషనర్ తీరును తప్పుబడుతూ నిరసనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో బహిరంగ స్నానం చేస్తూ నిరవధిక నిరసనలు తెలిపారు. ఎమ్మెల్యే తన సొంతానికి మున్సిపాలిటీ డీజిల్‌ను వినియోగించుకుంటున్నారని ఆరోపణలు చేశారు.

డీజిల్‌పై ఫ్లెక్సీల ఏర్పాటు

డీజిల్ వినియోగంపై ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై వైసిపి నేతలూ స్పందించారు. మున్సిపాలిటీ డీజిల్ వినియోగం 2019 సంవత్సరం ముందు ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంత వినియోగించారు.? 2019 సంవత్సరం అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి హయాంలో ఎంత వినియోగించారు.? ఎంత ఖర్చు అయ్యింది..? అన్న వివరాలను తెలియజేస్తూ పట్టణంలో ఆదివారం నాడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను చూసిన ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే గజదొంగని, తాను ప్రజల మనసులు దొంగలించిన దొంగనంటూ తెలియజేశారు. ఇలా టిడిపి, వైసిపి నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేతల మధ్య ఆధిపత్యపోరుతో పురపాలక సంఘం నుంచి సేవలు పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్నామనే వాదన ప్రజల నుంచి విన్పిస్తోంది. నేతలు ఇలాంటి ఆరోపణలు మాని మున్సిపాల్టీ, ప్రజల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జగనాసురుడి పాలనకు చరమగీతం పాడుదాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బికె, మాజీ మంత్రి పల్లె



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బికె, పల్లె

ప్రజాశక్తి-పెనుకొండ

'జగనాసురుడి పాలనకు చరమ గీతం పాడుదాం' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బి.కె పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ అవినీతి, నేరాల రాక్షసుడు జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తండ్రి మరణాన్ని వాడుకుని ఓదార్పు పేరుతో 2014 ఎన్నుకలకు ముందు రాజకీయంగా ఎదగాలని ప్రయత్నించాడని, 2019 ఎన్నికలకు ముందు సొంత బాబాయిని హత మార్చి తన సంకల్ప యాత్రకి నాంది పలికి తనకు శవ రాజకీయాల్లో ఉన్న నేర్పుని మరో సారి బయటపెట్టాడని ఆరోపించారు. స్వార్ధ ప్రయోజనాల కోసం కుటుంబాన్ని సైతం బలి చేశాడన్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులే దీనికి ఉదాహరణ అన్నారు. తొలుత వారి దినపత్రికలో వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారు అని చెప్పి, తరువాత దానిని మసిపూసి మారేడుకాయచేసి నారాసుర రక్త చరిత్రగా వర్ణించి టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. జగన్ అధికారం చేపట్టాక వివేకా హత్య కేసు విచారణ సీబీఐకి ఇవ్వాలని వేసిన పిటిషన్‌ని కూడా ఉపసంహరించుకున్నాడన్నారు. అప్పటి నుంచి జగన్ నిజస్వరూపం నెమ్మదిగా బయటకు వచ్చిందని తెలిపారు. జగన్ కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు అరెస్టు అవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్తంగా, అవినీతి మాయంగా మారిందని ధ్వజమెత్తారు.

వైసిపికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైంది..

ప్రజాశక్తి-రొద్దం

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామంలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, అనంతరం అనేక భారాలు మోపుతూ ప్రజల వెన్నెముక విరుస్తున్నారన్నారు. దీంతో ప్రజలు విసుగు చెంది జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి హనుమంతరాయప్ప, డీలర్ రామంజి, అనిల్, అశోక్, రామంజి, ఈడిగ రామంజి, సుబ్బరాయుడు, పావగడ అంజనప్ప, తురకలాపట్నం, నాయకులు పాల్గొన్నారు.

దారి మధ్యలో ఆగిపోతున్న ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులు కొన్ని రోజులుగా ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఎల్‌జిబి నగర్ వద్ద ఒకటి నిలిచి పోగా, ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఆర్.మరువపల్లి వద్ద బ్రేక్ లైనర్లు పని చేయక రోడ్డుపై నిలబడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ డిపోకు నెల రోజుల క్రితం నాలుగు కొత్త బస్సులు ఏర్పాటు చేయగా అందులో రెండు బస్సులు మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం పెనుకొండ-పావగడ మార్గంలో 6 బస్సులు రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇకనైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు కండీషన్‌లో ఉన్న బస్సులు ఏర్పాటు చేసి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డుపైనే ఆగిపోయిన ఆర్‌టిసి బస్సు



శ్రమజీవుల హక్కుల పోరాటమే..!

నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు

ప్రజాశక్తి- అనంతపురం

సమాజాభివృద్ధిలో కార్మికులు, కర్షకులు, శ్రామికుల సేవలు కీలకం. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే వారి పాత్ర ఎంతో ముఖ్యమైనది. అలాంటి కార్మికులు నేడు అభద్రత భావంతో జీవనం సాగిస్తున్నారు. వెట్టిచాకిరీ, వివక్ష నేటికీ కొనసాగుతోంది. న్యాయమైన హక్కుల కోసం పోరాటాలు చేయాల్సిన దుస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా కార్మికుల తలరాతలు మాత్రం మారడం లేదు. అమెరికాలోని చికాగోలో పని గంటల విధానం అమలు చేయాలని కోరుతూ కార్మికులు బలిదానం చేశారు. ఆ కార్మికుల పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా మే 1తేదీన మేడేను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. నేడు 134వ మేడేను జరుపుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను సోమవారం నాడు ఘనంగా నిర్వహించేందుకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేసుకున్నారు. సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వాడవాడలా మేడే జెండాలను ఎగురవేయనున్నారు. రాబోవు రోజుల్లో కార్మికుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి నినానంతో కార్మికలోకం మేడే సాక్షిగా నినదించనుంది.

కేబుల్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలో కేబుల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈదుల బలాపురం గ్రామం నుంచి గోరంట్ల వరకూ నూతన 420 కె.వి లైన్ పనులు జరుగుతున్నాయి. అయితే రెండు రోజుల క్రితం కొందరు దొంగలు రూ. 95 వేల విలువ చేసే కేబుల్ వైరును ఎత్తుకెళ్లినట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి గుడిపల్లి గ్రామానికి చెందిన గాజుల వెంకటేష్, గోపాల్, పూల నరేంద్ర, ఈడిగ వెంకటేష్, హరిజన నరేష్‌లను పాపిరెడ్డిపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేశారు. అలాగే వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

కదిరిలో గుట్టుగా గుట్కా.. జోరుగా మట్కా?

యథేచ్ఛగా లాటరీ, గంజాయి విక్రయాలు.. నూతన డీఎస్పీకి సవాళ్ల స్వాగతం..



ప్రజాశక్తి, కదిరి టౌన్

కదిరి పోలీస్ సబ్ డివిజన్ ఆఫీసం (డీఎస్పీ)గా బాధ్యతలు చేపట్టనున్న ఎం.శ్రీలతకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాల పునర్విభజనకు ముందు కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోని మొత్తం 11 స్టేషన్లు డివిజన్ పరిధిలో ఉండేవి. జిల్లాల విభజన తర్వాత పట్నం, ముదిగుబ్బ, ధర్మవరం డివిజన్‌లోకి, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, అమడగూరు పుట్టపర్తి డివిజన్‌లో కలిపారు. దీంతో కదిరి పోలీస్ సబ్ డివిజన్‌లోని 11 స్టేషన్లలో 5 ఇతర డివిజన్లలోకి వెళ్లడంతో ప్రస్తుతం పట్టణంతో పాటు చుట్టుపక్కల 5 మండలాల స్టేషన్లతో కలిపి 7 స్టేషన్లతో ప్రస్తుతం కదిరి డివిజన్ కొనసాగుతోంది. కదిరి నియోజకవర్గం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు. అలాగే చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు కదిరి పట్టణానికి ఉపాధి కోసం వచ్చి భవన నిర్మాణ, తదితర రంగాల్లో దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు స్వార్థపరులు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాయచోటి, తదితర ప్రాంతాల నుంచి లాటరీ టికెట్లు తీసుకొచ్చి రోజువారి కూలీలకు ఎరవేసి వారి జీవన విధానాన్ని ఇటువైపు మళ్లించి వారి శ్రమను దోచేస్తూ వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. కదిరి పట్టణంలో లాటరీ, మట్కా, గుట్కా విక్రయాలు, బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అలాగే యువత పదుల సంఖ్యలో గంజాయికి బానిసవుతున్నారు. నిజాం వలి కాలనీ, రాయచోటి రోడ్డు రైల్వే ట్రాక్, కందికుంట నారాయణమ్మ, తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. వీటికి తోడు కర్ణాటక మద్యం, గుట్కా తనకల్లు కదిరి పట్టణానికి పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రసిద్ధి చెందిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నిత్యం భక్తులు వేలాదిగా వస్తుంటారు. ప్రధానంగా హిందూపురం రోడ్డు, దేవళం వీధి, ఇక్బాల్ రోడ్డు, కోనేరు సర్కిల్ బైపాస్ రోడ్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. లోడింగ్, అన్‌లోడింగ్ కోసం భారీ వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలుపు తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో కదిరి పట్టణ ప్రజలు, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మిస్టరీ కేసులపై దృష్టి సారించేరా..?

కదిరి పట్టణంలో సంచలనం రేకెత్తిన బంగారు నగల వ్యాపారి కరణ్ హత్య 2021లో జరిగింది. అలాగే పట్టణంలోని కళాశాల రోడ్డులో దుకాణం నిర్వహించే ప్రమీల గతేడాది హత్యకు గురైంది. ఈ రెండు కేసులు అప్పట్లో సంచలనం రేకెత్తించాయి. ఆయా కేసుల్లో దర్యాప్తు కొనసాగించినప్పటికీ పురోగతి కనిపించలేదు. నూతన డీఎస్పీ వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి



శ్రీశ్రీ జయంతి సభలో మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని బ్రిలయన్స్ స్కూల్‌లో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి అధ్యక్షతన కవి 'చౌశా' రాసిన 'రావణ కాష్టం' పుస్తక పరిచయసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త ఘనగిరి జన చైతన్య వేదిక అధ్యక్షుడు పి.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజల వైపు నిలబడిన కవి శ్రీశ్రీ అన్నారు. శ్రీశ్రీ కవిత్వం సామాజిక చైతన్యం రగిలించి, యువతను ఉత్తేజపరచి సమాజానికి మంచి చేసేలా ప్రేరేపిస్తుందని అన్నారు. ప్రస్తుత దేశ పరిస్థితులను ఆకలింపు చేసుకొని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సరళమైన భాషలో కవి చౌశా 'రావణ కాష్టం' పుస్తకం రాశారని, అందులో కవి లౌకిక దష్టి అభినందనీయం అన్నారు. మత చాందస శక్తులను తూర్పారబట్టారన్నారు. దేశంలో మెజారిటీ మతం పక్షాన నిలబడి దేశాన్ని తక్షణమే కాషాయికరించి, రాజ్యాంగాన్ని మార్చి, హిందూ దేశంగా ప్రకటించి వీర్రావీగాలని చూస్తున్న పాలకులను చౌశా తన కవిత్వంతో దీటుగా ప్రశ్నించారన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు అధికార పార్టీ చేస్తున్న కుట్రలను నిఘా నేత్రంతో పరిశీలించి, మతోన్మాదం దేశానికి ప్రమాదకరం అని భావించి అదే అంశాన్ని వస్తువుగా తీసుకొని 62 కవితలు రాయడం గొప్పవిషయమన్నారు. సమాజాభివృద్ధికి మతోన్మాదం అడ్డంకిగా మారింది అని తన కవితల ద్వారా చెబుతూ, భాధ్యత గల పౌరులు మతోన్మాద ఉచ్చులో పడొద్దని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారన్నారు. రావణ కాష్ఠం పుస్తకం అందరూ చదవడంతో పాటు ప్రజలందరూ ఐక్యంగా మతోన్మాదుల కుట్రలను తిప్పి కొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవూఫ్, సెడ్స్ బాషా, గణేష్, ఇలియాజ్, బాబా, నరసింహా, తెలుగు అధ్యాపకులు రామన్న, సురేష్, మహబూబ్ బాషా, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 381. 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 381.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 7 మండలాల్లో మినహా మిగిలిన 25 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. కనగానపల్లి, ఎన్‌పి కుంట, నల్లమాడ, కొత్తచెరువు, ఓబులదేవరచెరువు, హిందూపురం, లేపాక్షి మండలంలో వర్షం పడలేదు. అత్యధికంగా గాండ్లపెంట మండలంలో 74.6 మిల్లీమీటర్ల వర్షం, అత్యల్పంగా తాడిమర్రి మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి : టిడిపి

రామగిరి : వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని దుబ్బార్లపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సుబ్బరాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబుళేసు, తిప్పన్న, మురళి, సన్న ముత్యాలప్ప, పాపన్న, లింగప్ప, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండలపరిధిలోని దేవరింటిపల్లికి చెందిన వైసీపీ కార్యకర్త కె.ఆంజనేయులు ఇటీవల మృతిచెందాడు. దీంతో మృతుని కుటుంబానికి వైసీపీ నాయకులు బట్టి హైదరవలి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదేశాల మేరకు మృతుని భార్యకు రూ. 5వేలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

2 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణ సమీపంలోని గుట్టకిందపల్లి వద్దగల ఆర్డీటీ క్రీడామైదానంలో మే 2వతేదీ నుండి 31వ తేదీ వరకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు క్రికెట్ కోచ్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985329285 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు యథావిధిగా స్పందన

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలోని కలెక్టరేట్లో సోమవారం యధావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో స్పందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్పందన ప్రారంభమవుతుందన్నారు. సమస్యలున్న వారు అర్జీలతో పాటు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు జత చేయాలన్నారు.

పేదలపై భారాలు తగదు

కొత్తచెరువు : వైసిపి ప్రభుత్వం పేదలపై భారాలు మోపడం తగదని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు అన్నారు. కొత్తచెరువులో ఆదివారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు టిడిపి నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు నరసింహులు, చికెన్ సెంటర్ నాగేంద్ర, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం వాసవీమాత జయంతినిఆర్యవైశ్య, ఆలయ కమిటి వాటి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్తసత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ మండలి వారిచే జడకోలాటం, నృత్యప్రదర్శనలు, చిన్నారులచేత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలో వాసవి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వాసవి దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు వాసవిమాత జయంతిని శనివారం నిర్వహించారు. వాసవీమాత చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు పడుచూరి రామనాథం, కరే రవి, నాగరాజు, గిరి. మంజుల, కవిత, హెూటల్ రేఖ, అశోక్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

టాపర్స్‌ను సన్మానించిన యాజమాన్యం

హిందూపురం : సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను ఎస్‌డిజిఎస్ కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, అధ్యక్షులు చంద్రమోహన్ మాట్లాడుతు కళాశాలలో బైపిసి విభాగంలో అస్మా 945, హంసవర్ధని 907 మార్కులు సాధించికళాశాల టాపర్స్ నిలిచారన్నారు. ఇంటర్ ఎంఇసిలో తరుణ్ బాబు 813, రవి కిశోర్ 727 మార్కులు సాధించారన్నారు. తమ కళాశాలలో విద్యాపరంగా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో మంచి మార్కులు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నందకిశోర్, ప్రిన్సిపల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బదిలీ డీఎస్పీలకు వీడ్కోలు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా లో పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన డీఎస్పీలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డిఎస్‌పి ల సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా పరిధిలో పనిచేస్తున్న కదిరి డిఎస్‌పి భవ్య కిషోర్ , పుట్టపర్తి డిఎస్‌పి టిడి యశ్వంత్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి కె.వి రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి, పెనుకొండ హుస్సేన్ పీరా, ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డితో పాటు సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం, ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి




వర్షం, ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలు

ప్రజాశక్తి బత్తలపల్లి

ఈదురు గాలులు, వర్షానికి మండలంలోనిపండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. మూడు రోజులుగా వర్షం, ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాలలో అరటి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా దాదాపు రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. మండలంలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వానకు చేతికందిన అరటిపంట, మొక్కజొన్న నేలకొరగగా రూ.10లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు శ్రీనివాసులు, పల్లపోతుల శ్రీరాములు వాపోయారు.మండలంలోని ఎం. చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు ఎన్. శ్రీనివాసులు తనకున్న మూడు ఎకరాలలో 3600లు అరటి మొక్కలు నాటాడు. మొదటి పంట దిగుబడి చేతికందిన దశలో అమ్మకానికి సిద్ధంగా, మార్కెట్లో ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో ఆశించిన మేరకు లాభం చేకూరుతుందని ఆశపడ్డాడు. అకాల వర్షం ఈదురు గాలులు రైతుల ఆశలపై నీళ్లు చల్లింది, శనివారం రాత్రి వీచిన గాలి,వానకు కోత దశలో ఉన్న 2500ల చెట్లు నేలకొరిగాయి. దీంతో పంటనష్టం అపారంగా వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.


రూ.5లక్షలు నష్టం

తనకు రూ.5లక్షల వరకు నష్టం సంభవించిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశాడు. అదేవిధంగా మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన పల్లపోతుల శ్రీరాములు ఐదు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేయగా వర్షం, ఈదురు గాలులకు మరో నెల రోజుల్లో కోతకు కోయాల్సిన పంట నేలమట్టమైందని బాధిత రైతు శ్రీరాములు వాపోయాడు. మూడు నెలల క్రితం మొక్కజొన్న పంట సాగు చేయగా రూ.1.50 లక్షలు పంట సాగుకుపెట్టుబడి పెట్టినట్లు చెప్పారు మరో నెల రోజులలో పంట దిగుబడి చేతికి అందితే రూ.3.50 లక్షల వరకు దిగుబడి వచ్చేదన్నారు. ఈ సమయంలో ఈదురు గాలులు తన ఆశలను నీరుగార్చాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాగే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. ప్రభుత్వం దెబ్బతిన్న పండ్ల తోటలకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వాల్మీకుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం : పల్లె

ప్రజాశక్తి - కొత్తచెరువు

తెలుగుదేశం పార్టీతోనే వాల్మీకుల అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. కొత్తచెరువు లోని రైల్వే స్టేషన్ సమీపంలో జిల్లా వాల్మీకి సాధికారిక సమితి ఉపాధ్యక్షులు బండ్లపల్లి రాజు ఆధ్వర్యంలోనే వాల్మీకులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు జిల్లా వాల్మీకి సాధికారిక కమిటీ కన్వీనర్ బ్రాహ్మణపల్లి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ టిడిపి బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిందన్నారు. ఎంతోమంది ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను పొందారన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతి ఒక్క కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించిందన్నారు. ముఖ్యంగా వాల్మీకులకు బీసీ కులాల్లోనే మొదటి ప్రాధాన్యత కల్పించిందని అన్నారు. పదవి ఉన్నా లేకున్నా నియోజకవర్గంలో పర్యటించి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సబ్సిడీ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని అన్నారు. అనంతరం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలో పలువురు చేరారు. వేటూరి నారాయణస్వామి, ఇరగలపల్లి బేల్దారి శ్రీరాములు, చిన్న రాయుడు, రామకృష్ణ, లక్ష్మీ దేవమ్మ, లలితమ్మ, నారాయణమ్మ, అంజనమ్మ, గణేష్, వెంకట రాముడు తదితరులకు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కప్పల బండ సర్పంచి పెద్దన్న, వెంకట గారి పల్లి సర్పంచి లక్ష్మీదేవి ఓబులేసు, మాజీ సర్పంచి వెంకటనారాయణ, కిష్టప్ప, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సుబ్బరాయుడు, వెంకటనారాయణ, గాజుల చంద్రమోహన్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ఎస్టీలుగా గుర్తించాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వాల్మీకులను (బోయ) ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి జాయింట్ యాక్షన్ కమిటి రాష్ట్ర అధికార ప్రతినిధి తలారి చంద్రమోహన్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రమోహన్‌బాబుతో పాటు రాష్ట్ర కమిటి ప్రధానకార్యదర్శి అక్కులప్ప మాట్లాడారు. పార్లమెంట్‌కు పంపిన రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి సవరణలు చేసి రాష్ట్ర మంతటా వాల్మీకి కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలన్నారు. అందుకు పార్టీలకు అతీతంగా వాల్మీకి కులానికి చెందిన ప్రస్తుత, మాజీ ఎంపీలు ఎస్టీ స్టేటస్ తీర్మానాన్ని పాలో అప్ చేయాలని కోరారు. వాల్మీకులను ఓటుబ్యాంక్ దృష్టితో చూడకుండా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమపథకాలను అందరికి అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వాల్మీకి జెఎసి నాయకులు హరిప్రసాద్, వెంకటనారాయణ, నరేశ్, జూటూరు నాగరాజు, రాజేశ్, ఆనంద్, కేశన్న, రవి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మే 1వతేదీ నుండి 5వతేదీ వరకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులు సంజయ్‌కుమార్, సల్మాలను శెట్టిపి జయచంద్రారెడ్డితోపాటు అసోషియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయతుల్లాలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని ఇండోర్ స్టేడియంలో గత నెలలో జరిగిన టోర్నమెంట్ స్థాయి సిఎం పోటీలకు ఎంపికయ్యారన్నారు. అందులో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారన్నారు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

తనకల్లు: మండలం బొంతలపల్లికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఎర్రప్ప నాయిని ఓం ప్రకాష్ (37) మద్యానికి బానిసయ్యాడు. నిరంతరం మద్యం తాగడంతో ఆరోగ్యం కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని తల్లిదండ్రులను అడిగాడు. అందుకు వారు నిరాకరించారు. దీంతో గతనెల 27న రాత్రి పురుగుల మందు తాగి ఇంటి బయటకు వచ్చి వాంతి చేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు, బంధువులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుట పడటంతో 28న ఇంటికి వెళ్లాడు. తిరిగి ఆరోగ్యం విషమించడంతో మెరుగైన చికిత్స కొరకు బెంగళూరు కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ఓబుల దేవర చెరువు : కదిరి దేవాలయం వద్ద తప్పిపోయిన కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూర్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కూతురు శ్రావణిని ఓడిసి పోలీసులు చిన్నారి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రావణి కదిరి దేవస్థానం వద్ద ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తప్పిపోయింది. తప్పిపోయిన బాలిక గురించి కదిరి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఓడిసి ఎస్ఐ, సిబ్బంఇ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓడిసి బస్టాండులో బస్సులో వెళుతున్న శ్రావని అనే నాలుగేళ్ల చిన్నారిని పట్టుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

ఆలయంలో చోరీ

ఓబుల దేవర చెరువు : మండలంలోని వంచిరెడ్డిపల్లి హరిహర నందీశ్వర దేవాలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దుండగులు ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. హుండీలో రూ. 25 వేల నుండి రూ. 30 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ గోపి ఆలయాన్ని సందర్శించారు. క్లూస్ టీం ను రప్పించి చోరీకి సంబంధించిన ఆధారాల లభ్యంపై పరిశీలించారు.

ఏడాదిపాటు శ్రమిద్దాం..

ప్రజాశక్తి బత్తలపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర స్ఫూర్తితో మరో ఏడాది పాటు పార్టీ కార్యక్రమాలతో కష్టపడితే టిడిపిని అధికారంలోకి తీసుకురావచ్చునని ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని గుండా కళ్యాణమండపంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ శిక్షణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ధర్మవరం మైల్ స్టోన్ గా నిలిచిందన్నారు. అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్, ఆర్టిఎస్ విభాగం నుంచి మనోహర్ నాయుడు, మన టీడీపీ నుంచి రామాంజనేయులు, టెలిగ్రామ్ భాట్ నుంచి రమణ వెంకట పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రాష్ట్ర, పార్లమెంటు స్థాయి నాయకులు, మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, టిడిపి కుమ్మర శాలివాహన సాధికారత రాష్ట్ర కన్వీనర్ మదనాపు కుమ్మర పోతులయ్య, టిడిపి కన్వీనర్లు గోనుగుంట్ల నారాయణరెడ్డి, ఆర్‌టిఎస్ ధర్మవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బోయపాటి అప్పస్వామి నాయుడు, కమతం కాటమయ్య, చల్లా శ్రీనివాసులు, శ్రీనివాసులు, చిత్రం నాగభూషణ, రంగానాయుడు, నెట్టంరమణ, జగ్గు, జక్కంపూడి నాగభూషణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

లోటస్ పబ్లిక్ స్కూల్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణ భారతి విద్యాసంస్థల అధ్యక్షులు నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

కరువు జిల్లాల విద్యార్థులకు సువర్ణ భారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో వెలసిన లోటస్ పబ్లిక్ స్కూల్ ఒక వరం లాంటిదని సువర్ణ భారతీ విద్యాసంస్థల అధ్యక్షులు నీలకంఠరెడ్డి, శ్రీ కృష్ణదేవారాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కొండురు నాగభూషణ రాజు అన్నారు. పెనుకొండ రోడ్డు కొట్నూరు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిస లోటస్ పబ్లిక్ స్కూల్‌ను ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. అనంతరం విద్యాసంస్థల అధ్యక్షులు నీలకంఠరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులు కొండురు నాగభూషణ రాజు, గుత్తికి చెందిన గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎమ్‌డి రఘునాథ్ రెడ్డి, శ్రీ వాణి, ప్రొఫెసర్ కెశవరెడ్డి, డాక్టర్ జెసిఆర్ బయో సైన్స్ సిఇఒ జయచంద్ర రెడ్డి, డాక్టర్ కె, రఘునాథ్ రెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, ప్రియ గంగధర్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జెఇ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. హిందూపురం పట్టణంలో అంతర్జాతీయ వసతులతో విద్యార్థుల తల్లిదండ్రులు అభిరుచి మేరకు సువర్ణ భారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో లోటోస్ పబ్లిక్ స్కూల్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. సిబిఎసిఇ సిలబస్‌తో విద్యనందించడమే ౦ కాకుండా కేంద్ర ప్రభుత్వ నియమానుసారం అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల సామార్థ్యనికి అనుగుణంగా ఐఐటి, మెడిసన్ ఇతర ఉన్నత విద్యా అవకాశాల పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతానికే ఈ పాఠశాల ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇదే సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు సువర్ణ భారతి యాజమాన్యనికి అభినందించారు. ఈ కార్యక్రమాలలో సువర్ణ భారతి విద్యాసంస్థల కార్యదర్శి అనీల్ కుమార్, ట్రెజరర్ రవీంద్రరెడ్డి, లోటస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లన్స్ డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి, ప్రిన్సిపల్ సూర్యనారాయణ, సువర్ణ భారతీ విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటికి సిమెంట్ రోడ్డు

టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ సెల్ఫీ ఛాలెంజ్

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే స్వగహానికి వెళ్లడానికి సిమెంట్ రోడ్డు వేసుకోవడంతో ఆదివారం టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ ఎమ్మెల్యేకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు, మడకశిర నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లు ఉన్నా పట్టించుకోని ఎమ్మెల్యే సొంత ఇంటికి వెళ్లడానికి సిమెంట్ రోడ్డు వేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ రోడ్డు వద్ద సెల్ఫీ తీసుకొని ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు వేసుకున్నారా.. ప్రభుత్వ నిధులతో వేసుకున్నారా అని ప్రశ్నించారు. అలాగే గ్రామాల్లో ఉన్న గుంతల రోడ్లను పూడ్చాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్, తదితరులు

బాగేపల్లి న్యూస్...

సిపిఎం అభ్యర్థికి నీరాజనం

ప్రజాశక్తి - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

బాగేపల్లి తాలుకా గూళురు హెూబ్లీ కేంద్రంలోని సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్‌కు ప్రజలు అడుగడున నీరాజనం పలుకుతున్నారు.గ్రామంలోకి ప్రవేశించినప్పటి నుండి చివరి దాక అడుగడుగున పూలహారాలు వేస్తూ స్వాగతం పలుకుతూ తమ మద్దతు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంతింటి కల నిజం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతామన్నారు. అనేక మంది పేదవారు సొంత ఇళ్లు లేక బడుగ ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్న చిన్న ఇరుకు ఇళ్లలో రెండు మూడు కుటుంబాలు ఉంటున్నాయని అన్నారు. ఈ మేరకు ఇంటికి ప్రచారం చేస్తున్న సందర్భంగా ఈ విషయాన్ని గుర్తించానని అన్నారు. వచ్చే ఐదేళ్లలో ఏ గ్రామంలోను పూరిగుడిసెలు కనిపించకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనేక గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతూ ప్రచారం చేస్తున్నారని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. సిపిఐ(ఎం) ఎన్నడు లేని విధంగా ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటితో గెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప, బాగేపల్లి తాలుక కార్యదర్శి రాఘురాంరెడ్డి, స్థానిక నాయకులు సిపిఐఎం, జెడిఎస్, రైతు,యువజన,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పించాలన్నదే లక్ష్యం

ప్రజాశక్తి, కదిరి టౌన్

గ్రామీణ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఎటిడి కంపెనీ నెలకొల్పినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు అమర్నాథ్ రెడ్డి, సుకుమార్ రెడ్డి, సంగీత తెలిపారు. కార్మిక దినోత్సవం పురస్కరించుకొని అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబం లో జన్మించిన తానుఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు కోసం ఒకప్పుడు బెంగళూరు వెళ్ళానని అన్నారు. అక్కడే ఒక కంపెనీ లో నెలకు 6వేల రూపాయల వేతనంతో పనిచేసినట్లు చెప్పారు. జీవితంలో ఒక లక్ష్యం నిర్దేశించుకోని ఎంతో కష్టపడుతూ ఒక్కో మెట్టు ఎక్కుతూ వెళ్లానని వివరించారు. తనకు మొదట యుఎస్ఎ లోని ఒక సంస్థ నుండి అవకాశం రావడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముగ్గురం కలసి సమూహంగా ఏర్పడి ఎటిడి కంపెనీని నెలకొల్పామన్నారు. యుఎస్ఎ కంపెనీ నిర్దేశించిన ట్రాఫిక్ డేటా వెహికల్ వాల్యూమ్స్ కు సంబంధించి ప్రాజెక్ట్ తమకు అప్పజెప్పడంతో ఎలాంటి లావాపేక్ష లేకుండా మూడు నాలుగు నెలల పాటు పనిచేశామన్నారు. ఆ తర్వాత తమకు యుఎస్ఎ కంపెనీ అప్పజెప్పిన పని నిర్దేశించిన కాలంలో పూర్తి చేయడంతో ఆ కంపెనీ నుండి డబ్బులు వచ్చాయని తమ పనితీరు బాగుండడంతో యుఎస్ఎ నుంచి మరిన్ని అవకాశాలు లభించాయని తెలిపారు. అందులో భాగంగా బెంగళూరులో తొలిసారి 20 నుండి 30 మంది తో పని ప్రారంభించామని తర్వాత ఆ సంఖ్య 50కి పెరిగిందన్నారు. తమకు జన్మనిచ్చిన కరువుకు నిలయమైన కదిరి ప్రాంతంలో ఉన్నత చదువులు చదివిన ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు సుదూర ప్రాంతలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరలకు వలసలు వెళ్లకుండా కొంతమేరకు సొంత ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సంకల్పించామన్నారు. అందులో భాగంగానే కదిరిలో ఎటిడి బ్రాంచి నెలకొల్పి గత ఏడాది 20 మంది తో తమ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించామని వివరించారు. నాలుగైదు నెలల తర్వాత ఇక్కడ 45 మంది దాకా ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా తమ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి వారి పనితీరు ఆధారంగా నెలకు వారికి ఒక్కొక్కరికి వేతనం రూ. 12వేలదాకా చెల్లిస్తూ ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం తోపాటు ప్రతి ఏడాదికి ఒకసారి బోనస్ ఇస్తున్నామని చెప్పారు. తమ సంస్థ కార్యకలాపాలు మరింత మెరూగుపరుచుకొని భవిష్యత్తులో మరింత మందికి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఈసందర్భంగా తెలిపారు.



కదిరిలోని ఎడిటిలో పనిచేస్తున్న సిబ్బంది



ఇంటర్ ఫలితాల్లో ఎల్ఆర్‌జి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - హిందూపురం

ఇంటర్ ఫలితాల్లో ఎల్ఆర్‌జి నాయుడు జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్, జూనియర్ ఇంటర్ విద్యార్థులు మంచి ప్రతిభా కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇంటర్ ఫలితాలపై ఆయన శనివారం మాట్లాడుతు ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యున్నత మార్కులతో పాటు అత్యుత్తమ పాస్ పర్సంటేజ్ సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో బి చేతన్ 977, సి.నంద వర్ధన్ 977, బైపిసి విభాగంలో బి సంధ్య 986, ఎన్ చందన 982 మార్కులు సాధించారన్నారు. అలాగే సీనియర్ ఎంఇసి విభాగంలో ఆర్. కృతి 981, వి అనుశ్రీ 977, సిఇసి విభాగంలో ఎస్ఎన్ ముస్కాన్ 971 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే జూనియర్ ఎంపీసీ విభాగంలో భార్గవి 462, బైపీసీ విభాగంలో అయిషా మహబూబా 431, జూనియర్ ఎంఇసి విభాగంలో కే డింపుల్ 481, జూనియర్ సిఇసి విభాగంలో వై. లక్ష్మి 466 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సెక్రటరీ బాల సుందరం, ఎఒ సంజీవరెడ్డి, పాఠశాల హెచ్ఎం

ప్రాథమిక పాఠశాలకు పుస్తకాల వితరణ

సోమందేపల్లి : విశ్రాంత తెలుగు పండితులు కే.తిమ్మారెడ్డి నిత్యజీవితంలో సేకరించిన వందల పుస్తకాలను ఆదివారం ఆయన కుమారుడు రాఘవరెడ్డి, మేనల్లుడు రఘునాథ్ రెడ్డి ఎంఇఒ ఆంజనేయులు నాయక్, హెచ్ఎం లక్ష్మీబాయి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ నేటి ప్రపంచీకరణ, సాంకేతీకరణ కారణాలతో విద్యార్థులు పుస్తకాలకు దూరమవుతున్నారన్నారు. పుస్తక పఠనం మనిషికి ఉన్నత జీవితాన్ని అందిస్తుందని, సమాజంలో గొప్ప వారందరూ పుస్తక పఠనానికి ప్రాధాన్యమిచ్చారన్నారు. తిమ్మారెడ్డి ఎన్నో పుస్తకాలను సేకరించగా ఆయన అనంతరం ఆ పుస్తకాలను మన పాఠశాలకు ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, పద్మావతి, ప్రభావతి, , రేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

మే డే
కార్మిక దినోత్సవ

సోమవారం, మే, 1, 2023 | ప్రత్యేక అనుబంధం | పేజీలు: 12

కార్మికుల పోరాటమే నినాదం..!

శ్రమజీవుల జయకేతనం సమున్నతంగా ఎగిరిన రోజు మే డే. అప్పటి సామ్రాజ్యవాదం మీద కార్మికవర్గం పోరాడి సాధించిన విజయానికి ప్రతీక ఈ రోజు. అమెరికా సామ్రాజ్యవాదానికి, జార్జి చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించిన అమరవీరులకు లాల్‌సలాం అంటూ ప్రపంచ వ్యాప్తంగా మే డేను కార్మికలోకం ఘనంగా జరుపుకోవడం రివాజు. ఈ నేపథ్యంలో మేడే విశిష్టతను, మన ముందున్న కర్తవ్యాలను తెలుసుకుందాం.

మిగతా 3లో

కష్టమెక్కువ.. వేతనం తక్కువ

పెరుగుతున్న శ్రమదోపిడీ

అమలు కాని కార్మిక చట్టాలు

ఇఎస్ఐ అసుపత్రి ఉన్నా.. లేనట్టే..

రోజురోజుకూ దిగజారుతున్న కష్టజీవుల పరిస్థితి



పని చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-హిదూపురం

కష్టం ఎక్కువ.. వేతనం తక్కువ.. జిల్లాలోకి ఏ పరిశ్రమలో చూసినా ఇదే పరిస్థితి.. ఏ కార్మికుడిని కదిలించినా కనీటి గాథలే.. పెరుగుతున్న శ్రమ దోపిడీని అడ్డుకునే అధికారులే కనిపించకుండా పోయారు. జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా హిందూపురం నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. అయితే ఏ పరిశ్రమలోనూ కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నది నగ్న సత్యం. ముఖ్యంగా హిందూపురం పారిశ్రామికవాడలో ఉక్కు, గార్మెంట్స్, రసాయన పరిశ్రమలు, రోల్‌వెల్ తదితర పరిశ్రమలు ఉన్నాయి. అలాగే లేపాక్షిలో కూడా గార్మెంట్స్ ఇతర పరిశ్రమలు, చిలమత్తూరు మండలంలో గ్రానైట్, పైపుల పరిశ్రమలతోపాటు గార్మెంట్స్ తదితర పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో దాదాపు వేలాది మంది కార్మికులు పని చేస్తున్నప్పటికీ కనీస వేతనం అమలు చేస్తున్న పాపానపోలేదు. అంతేగాకుండా కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. మరోవైపు మౌలిక వసతులు ఉన్నాయో, లేదో పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ అసలు పట్టించుకోవడం లేదు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన కలెక్టర్ సైతం తమకెందుకులే అన్న విధంగా ఉన్నారు. కార్మికులందరికీ కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ వంటి సౌకర్యాలు అమలు కావడం లేదు. పరిశ్రమల్లో కార్మికుల సంఖ్యకు అనుగుణంగా మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను సైతం కల్పించడం లేదు.

అసంఘటిత సంఘ కార్మికులకు అన్ని సమస్యలే..

నియోజకవర్గవ్యాప్తంగా అసంఘటిత రంగంలో సుమారు 50వేల మందికిపైగా పని చేస్తున్నారు. భవన నిర్మాణం, ప్రయివేట్ విద్య, వైద్యం, దుకాణాల్లో గుమాస్తాలు, వీధి వ్యాపారులు, ఇంటి పనివారు తదితర రంగాల్లో పని చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల కారణంగా భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందన్న విమర్శలు ఉన్నాయి. ఒక్క నెల పనులు ఉంటే మరో మూడు నెలలు పనులు లేకుండా పోతున్నాయి. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను సైతం దారి మళ్లిస్తోంది. దీంతో నిధులు లేకపోవడంతో నిర్మాణ కార్మికుల క్లైమ్స్ సకాలంలో పరిష్కారం కావడం లేదు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదు. సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించడం లేదు. సివిల్ సప్లై, సిమెంట్, ట్రాన్స్‌ఫోర్టు కార్మికులు పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అమలు కాని కనీస వేతన చట్టం

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలలో దాదాపు 60వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో కనీసం 20 శాతం మందికి కూడా కనీస వేతనాలు అమలు కావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న కనీస వేతనాలు రావడం లేదు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ఇచ్చే వేతనాలు కూడా సక్రమంగా కార్మికులకు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతినెల వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, ఆరోగ్యం, పిల్లల చదువుల కోసం వారి ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. తీసుకుంటున్న అప్పులు కూడా సరిపోని పరిస్థితి ఉంది. పదో పిఆర్‌సి ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. అరకొరగా వేతనాలను పెంచి ఉద్యోగులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచామంటూ గొప్పలు చెప్పుకుంటున్న పరిస్థితి. అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్ ఆచరణలో అమలు చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు.



ఇఎస్ఐ ఆసుపత్రి

శ్రమ దోపిడీకి గురవుతున్న స్కీమ్ వర్కర్లు

అంగన్‌వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్య, వైద్య రంగాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త కొత్త విధానాలను తీసుకొస్తూ వీరితో అదనపు శ్రమ చేయిస్తున్నారు. స్కీమ్ పథకాలలను ఒక్కొక్కటీ ప్రయివేట్ వ్యక్తులకు అప్పగిస్తూ స్కీమ్‌వర్కర్ల ఉపాధికి ఎసరు పెడుతున్నారు. మరోవైపు అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయిస్తున్నాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు ఇవ్వడాన్ని సిద్ధమవుతున్నారు.



నిర్మాణ పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దుర్భర జీవనంలో ట్రాన్స్‌ఫోర్టు కార్మికులు

ట్రాన్స్‌ఫోర్టు రంగంలో పని చేసే కార్మికుల జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయి. మోటారు ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యాక్టు 1961 నిర్ధేశించిన 8 గంటల పని విధానం కాగితాలకే పరిమితమైందని చెప్పవచ్చు. ఈ చట్టం ప్రకారం నేషనల్ పర్మిట్ పొందిన వాహనంలో ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. అయితే ఒక్క డ్రైవరే ఉంటున్నాడు. దీంతో వాహన డ్రైవర్లు రోజుల తరబడి ఇంటికి కుటుంబాలకు దూరంగా ఉంటూ కాలకృత్యాలు, స్నానాలు, ఆహారం తీసుకోవడం వంటివి రోడ్లపైనే చేయాల్సి వస్తోంది.

ఇఎస్ఐ ఆసుపత్రి ఉన్నా.. సిబ్బంది లేరు..


నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 60వేల మందికిపైగా కార్మికులు ఉంటున్న నేపథ్యంలో హిందూపురంలో ఇఎస్ఐ డిస్పన్సరీ ఏర్పాటు చేశారు. అయితే తగినంత సిబ్బందిని మాత్రం నియమించలేకపోతున్నారు. సాధారణంగా ఇంతమంది కార్మికులు ఉన్న చోట సూపర్ స్పెషాలిటీ ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే చిన్న అద్దె గదిలో ఆసుపత్రిని నడపడం బాధాకరం. ఈ అసుపత్రిలో మందులు, సిబ్బంది లేకా కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇఎస్ఐ ఆసుపత్రికి పక్కా భవనం నిర్మించాలని సిఐటియు ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన చేయడంతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో తగిన సిబ్బందిని నియమించి కార్మికులకు సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులకు అండగా నిలబడుతాం

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్.వెంకటేష్



కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన సిఐటియు ఈ ప్రాంతంలో బలంగా ఉంది. వారి సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. ఫలితంగా కొన్ని పరిశ్రమల్లో కనీస వేతనంతోపాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు యాజమాన్యాలు కల్పించాయి. అయితే కొన్ని పరిశ్రమలో కార్మిక సంఘాలను సైతం లోపలికి రానివ్వకుండా యాజమాన్యాలు అడ్డు తగులుతున్నాయి. ముఖ్యంగా గార్మెంట్స్ పరిశ్రమల్లో ఆయా యాజమాన్యాలు మహిళల శ్రమను దోచుకుంటున్నాయి. కనీస సౌకర్యాలు సైతం కల్పించడం లేదు. యాజమాన్యాలే కార్మికులను తీసుకురావడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏర్పాటు చేయకపోవడంతో ఆటో సహాయంతో కార్మికులు విధులకు హాజరు కావడానికి పోతూ పలుమార్లు ప్రమాదాలు జరిగి కొంతమంది మృత్యువాత పడడమే కాకుండా అంగ వైకల్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కార్మిక శాఖ స్పందించి కార్మికులకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను కలుపుకుని ఆందోళనలు చేపడతాం.



అంబేద్కర్ జయంతి సందర్భంగా పూల మాలలు నివాళులు అర్పిస్తున్న కమిషనర్, ఉద్యోగులు (పాతచిత్రం), ఇన్‌సెట్‌లో అంబేద్కర్ విగ్రహం

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల కృషి

అద్భుతవనంలో అంబేద్కర్ విగ్రహం - రూ.5లక్షలతో రూపుదిద్దిన ఉద్యోగ కార్మికులు


ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల కృషితో అద్భుత వనాన్ని ఏర్పాటు చేసి చెత్తకుప్పల్లో పడేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఈ వనంలో విగ్రహానికి రంగులు వేసి నూతన శోభను తీసుకొచ్చారు. టిడిపి హయంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలను ఆధునీకరణ చేయడంలో భాగంగా అప్పట్లో కొన్ని విగ్రహాలను తొలగించారు. ఈ తరుణంలో పాత విగ్రహాలను మున్సిపల్ కార్యాలయంలో పడేశారు. ఇలా పడేసిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు ఎలాగైన జీవం పోయాలని మున్సిపల్ జెఎసి అధ్యక్షులు బండి ఆనంద్‌రాజ్‌తోపాటు మనోహర్, రామాంజి, రాము తదితరులు ఒక బృందంగా ఏర్పడి ఉద్యగ, కార్మికులతో పాటు దాతల సహకారంతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఒక ఉద్యన వనాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దారు. రంగుల హంగులతో పాటు పచ్చదనం ఉండేలా చూడటంతో కార్యాలయ ఆవరణం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. అంతేగాకుండా రోజూ ఎంతో మంది ఈ ఉద్యానవనంలో నేడు సేదదీరుతున్నారు.


HAPPY MAY DAY
మేడే శుభాకాంక్షలు
May Day
జిల్లాలోని చీనీ రైతులకు, మామిడి రైతులకు, హమాలీలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, వ్యాపారులకు, శ్రేయోభిలాషులకు "మేడే" శుభాకాంక్షలు.
M.S.N. FRUITS
లక్ష్మిసాయి గణపతి ఫ్రూట్స్
ఫ్రూట్స్ మర్చంట్ & కమీషన్ ఏజెంట్, షాప్ నెం.55
మార్కెట్‌యార్డ్, గుత్తిరోడ్, అనంతపురం-515005
బాలక్రిష్ణ ఫ్రూట్ మర్చంట్
ఫ్రూట్స్ మర్చంట్ & కమీషన్ ఏజెంట్
రామినేపల్లి గ్రామం, పెట్రోల్ బంకు ప్రక్కన అనంతపురం
మదమంచి సుబ్బానాయుడు
ఎం.బాలక్రిష్ణ
ఎం.మల్లికార్జున


మేడే శుభాకాంక్షలు
కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రతి కార్మికునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరేలా కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని కోరుకొంటూ... కార్మికులకు విప్లవ వందనాలు.
కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి!
మేనేజర్:
అరవింద్ రెడ్డి
ఏటిడీ కంపెనీ డైరెక్టర్లు:
అమర్‌నాథ్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి
సంగీత


మేడే శుభాకాంక్షలు
ప్రజలకు, కార్మికులకు "మేడే" శుభాకాంక్షలు
లేపాక్షి మండలంలోని పంచాయతీ కార్మికులు
మరియు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజలు
కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి!
HAPPY LABOR DAY


మేడే శుభాకాంక్షలు
MAY day
ప్రపంచ కార్మికులారా ఏకం కండి...
పోరాడితే పోయేది ఏమి లేదు బానిస సంకెళ్ళ తప్ప....ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే...
మేడే శుభాకాంక్షలు.
HAPPY MAY DAY
నామాల ఈశ్వరయ్య
ఎంపిహెచ్ఇఓ
యూనిట్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్
యూనియన్ జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా


May Day
మేడే శుభాకాంక్షలు
అనంతపురం జిల్లా అభివృద్ధికి కృషిచేస్తున్న ప్రజాప్రతినిధులకు,అధికారులకు, ప్రజలకు, రైతు సోదరులకు మరియు కార్మిక సోదరులకు "మేడే" శుభాకాంక్షలు.
రైతు ముంగిటకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషిచేస్తున్న వ్యవసాయాధికారులకు కృతజ్ఞతలు.
శ్రీమతి సుజిత
వ్యవసాయ విస్తరణ అధికారి ఆత్మకూరు మండలం
విజయ్‌కుమార్
వ్యవసాయ విస్తరణ అధికారి ఆత్మకూరు మండలం
ఆత్మకూరు మండల రైతు సోదరులు, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్స్


మేడే శుభాకాంక్షలు
ప్రజలకు, కార్మికులకు "మేడే" శుభాకాంక్షలు
గాండ్లపెంట మండలంలోని పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు "మేడే" శుభాకాంక్షలు.
ఎం.అక్కులప్ప
కె.నరసింహులు
ఎం.కదిరప్ప
ఆర్.ఆంజినేయులు
ఎం.ఆంజినేయులు
ఎం.మస్తానప్ప
ఎం.కొండయ్య
ఎన్.గంగులప్ప
ఎం.రవీంద్ర
టి.నరసింహులు
పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ గాండ్లపెంట మం॥


మేడే శుభాకాంక్షలతో...
ఇండియా ఫర్ ఇండియా
స్పందించు... సాయం అందించు
మీ వంతు సహాయం ఎన్నో జీవితాలను ప్రభావితం చేయగలదు!
సంప్రదించండి:
మేనేజర్,
ఇండియా ఫర్ ఇండియా
రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్
అనంతపురము
ఫోన్: 9441576527
ఈ QR కోడ్ ను స్కాన్ చేయండి
మా వెబ్ సైట్ ను సందర్శించండి
https://rdtfvf.org/donate
Moncho Ferrer
Programme Director - RDT
VicenteFerrer
Rural Development Trust

బాల్యం మగ్గాల్సిందేనా..

కాగితాలలకే పరిమితమైన బాల కార్మిక చట్టం
విద్యకు దూరమై కార్మికులుగా మారుతున్న బాల్యం
చట్టాలు అమలుకు నోచుకునేదెన్నడు..?



పంచర్ షాపులో పని చేస్తున్న బాల కార్మికుడు

ప్రజాశక్తి-హిందూపురం

సమాజంలో బాలుల కోసం రాజ్యాంగం రూపొందించిన బాల కార్మిక చట్టం కాగితాలకు మాత్రమే పరిమితమైందనే విషయం తేటతెల్లంగా కనిపిస్తోంది. చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అధికారుల నిర్లక్ష్య ఫలితంగా బాలల బాల్యం కార్మికులుగా మట్టిలోనే కరిగిపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నారులు బాల్యంలో విద్యాభ్యాసానికి దూరంగా ఉంటూ బానిస బతుకులు అనుభవిస్తున్నారు. పేదరికం, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఆదుకునేవారు లేకపోవడం తదితర కారణాలతో బాల కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. 14 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న బాల, బాలికలను పనుల్లో ఉంచుకోకూడదని చట్టం చెబుతోంది. దీన్ని అతిక్రమిస్తే పనిలో పెట్టుకున్న యజమానితోపాటు తల్లిదండ్రులకు శిక్ష పడుతుంది. అలాంటి చట్టాన్ని నీరుగార్చడం బాధాకరం. సమర్థవంతంగా చట్టాన్ని అమలు చేస్తే రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ పూర్తిగా రూపుమాపవచ్చు.

పథకాలు ఎన్నొచ్చినా ఫలితం శూన్యం

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వాలు ఎన్ని పథకాలు తీసుకొచ్చినా తగిన ఫలితం ఉండటం లేదు. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు గత టిడిపి ప్రభుత్వం ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు లేవు. అలాగే ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా అమ్మఒడి పేరుతో చిన్నారులు పాఠశాలలకు వెళ్తే ఆర్థికసాయాన్ని అందిస్తోంది. అయినప్పటికీ బాలకార్మికులను తగ్గించ లేకపోయారు. పాఠశాలలో పేరు ఉంటుంది.. దీనివల్ల తల్లికి అమ్మఒడి, పాఠశాలలో హెచ్ఎం, భోజన ఏజెన్సీ నిర్వాహకులకు మధ్యాహ్న భోజనం పెట్టినందుకు బిల్లులు చేసుకుంటున్నారే తప్ప బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించలేకపోతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

పనులు నిర్వహిస్తున్న చిన్నారులే నిదర్శనం..

నేడు మన కళ్ల ముందే చాలామంది బాలలు వివిధ రకాలు పనులు చేస్తుండటం బాల కార్మిక వ్యవస్థకు నిదర్శనంగా చెప్పవచ్చు. హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, ఉరవకొండ, అనంతపురం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో 14 సంవత్సరాల వయసులోపు బాలలు వివిధ రకాల వర్క్‌షాపులు, కిరాణా దుకాణాలు, టి స్టాళ్లు, గుజిరీ షాపులు, భవన నిర్మాణ పనుల్లో అనేకమంది బాలలు పని చేస్తున్నారు. ఒక్క హిందూపురంలోనే దాదాపు 500 మందికిపైగా బాలకార్మికులు ఉన్నారనడం అతిశయోక్తి కాదు. ఆడుతూ పాడుతూ, ఉల్లాసంగా ఉత్సాహంగా చదువును అభ్యసించాల్సిన చిన్నారులు కుటుంబ పోషణ నిమిత్తం చిన్నతనంలోనే బరువైన పనులు చేస్తుండటం బాధాకరం. బాలకార్మికులు కళ్లకు కట్టినట్టుగా ప్రతి అధికారికీ కనిపిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప చట్టలను అమలు చేసి బాలలకు బంగారు భవితను అందించలేకపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బాల కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేసి బాల కార్మికులకు విముక్తి కల్పించి బంగారు భవితకు బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు.





భవన నిర్మాణ రంగం, వర్క్‌షాపులో పనిచేస్తున్న బాలకార్మికులు



హోటల్‌లో పని చేస్తున్న బాలుడు

కష్టాల 'స్కీమ్' వర్కర్లు..!

◆ ఉద్యోగభద్రత కరువు ◆ వేధింపులు అధికం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చేందుకు అహర్నిషలూ శ్రమించే 'స్కీమ్' వర్కర్లకు కనీస గుర్తింపు కరువైంది. తమను వర్కర్లుగా గుర్తించాలని వారు అనేక ఏళ్లుగా పోరాటాలు సాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు వీటిని పెడచెవిన పెడుతూ వస్తున్నాయి. నిరంతరం అభద్రత, రాజకీయ వేధింపుల నడుమ జీవితాలను వెళ్లదీస్తూ వస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఉద్యోగాలు పోతాయోనన్న భయంతో బతుకులు వెళ్లదీస్తున్నారు. వర్కరుగానే గుర్తింపులేని కార్మికులకు కనీస వేతనాలు కరువయ్యాయి.

అనేక నిరాశల నడుమ 'ఆశా వర్కర్లు'

జిల్లాలో మూడు వేల మంది దాక ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. 88 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వీరు పనిచేయాల్సి ఉంటుంది. జాతీయ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక ఆశా వర్కర్లు చొప్పున పనిచేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సచివాలయానికి ఒకరు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సచివాలయం పరిధి అనేక సరికి ఒక్కో ఆశా పరిధిలో మూడు వేల మంది నుంచి ఐదు వేల మందికి ఒకరు చొప్పున వస్తున్నారు. ఇంత జనాభాకు సేవలు అందించడం ఆశలకు పెద్ద భారంగా మారుతోంది. సీజనల్ వ్యాధులతోపాటు, లెప్రసీ, లార్వా వంటి శ్యాంపుల్స్‌ను తీయాల్సి ఉంటుంది. వీటితోపాటు గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇంతటి భారాన్ని మోపుతున్న ప్రభుత్వం వారి అనేక పోరాటాల ఫలితంగా గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచినట్టు ప్రకటించింది. అయితే ఇది ఒక్కసారిగా ఇవ్వడం లేదు. రెండు విడతలుగా ఇస్తోంది. ఇకపోతే 60 ఏళ్లకే వారిని విధుల నుంచి తొలగించే నిర్ణయం చేసింది. వారికి ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వటం లేదు. వారికి ఆ సౌకర్యాలు కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ వేదింపుల నుంచి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



మధ్యాహ్న 'భోజన'ంలేని కార్మికులు

జిల్లాలో ఏడు వేల మంది వరకు మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. పాఠశాలల్లో పిల్లలకు భోజనం వండిపెట్టే ఈ కార్మికుల భోజనానికి మాత్రం గ్యారెంటీ లేదు. ప్రభుత్వాలు మారిన వెంటనే ఎప్పుడు నిర్వహణ బాధ్యతల నుంచి తప్పిస్తారోఅన్న భయం వెంటాడుతూ ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వం వారికిస్తామని వేతనంలోనూ కోత పెట్టింది. నెలకు మూడు వేల రూపాయలు వేతనమిస్తామని ప్రకటించి లాక్‌డౌన్ సమయంలో వారికి వెయ్యి రూపాయలే ఇచ్చింది. పాఠశాలలు లేకపోయిన పిల్లలకు పెట్టాల్సిన భోజనానికి సంబంధించి ఇవ్వాల్సిన సరుకులను ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారు. కాని ప్రభుత్వం వారికివ్వాల్సిన వేతనంలో కోత పెట్టింది. ఏజెన్సీలకు కాదని స్వచ్ఛంద సంస్థలకూ ఈ బాధ్యతలను కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోంది.

అంగన్‌వాడీలకూ తప్పని ఇబ్బందులు

